గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులే కీలకం

- ప్రజాసేవకు అంకితమైతేనే ప్రజల్లో గుర్తింపు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, జూలై 2: గ్రామాల అభివృద్ధిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే కీలకమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా మెట్‌పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాసేవకు అంకితమైనప్పుడే ప్రజాప్రతినిధులకు మంచి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఎంపీటీసీలకు తగిన గుర్తింపు లభించకున్నా గ్రామాభివృద్ధిలో భాగస్వాములై నిస్వార్థ సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎంపీటీసీలకు తగిన గుర్తింపు లభించేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీపీ సాయిరెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని చెప్పారు. ప్రజాసేవ చేసే ఏ ప్రజాప్రతినిధికైనా తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీతో పాటు ఎంపీటీసీలను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీపీ మారు సాయిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, తదితరులు

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

- డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి
- కలెక్టర్ సత్యప్రసాద్
- మెట్‌పల్లి పట్టణంలో పర్యటన

స్థల పరిశీలన

మెట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి, జూలై 2: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వేంపేట రోడ్డులో గల డ్రైనేజీని మంగళవారం ఆయన పరిశీలించారు. వాన కాలంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లల్లోకి వెళ్లకుండా వరద నీటిని మళ్లించేందుకు పెద్ద డ్రైనేజీ నిర్మించాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతతో చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే, పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-4ను తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులు, భోజన మెనూ, ఫుడ్ స్టాక్, పిల్లలకు అందించే కోడి గుడ్లు, తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పోషక పదార్థాలకు సంబంధించిన వివరాలను ఎన్‌హెచ్‌టీఎస్ మొబైల్ యాప్‌లో చూశారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ నివేదికల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఎత్తు, బరువుకు సంబంధించి కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణను క్రమంగా చేపట్టి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, డీడబ్ల్యూవో వాణిశ్రీ, పోషణ్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ మధుకుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, జూలై 2: పట్టణ శివారులోని జంబిగద్దె సమీపంలో సమీకృత గురుకుల విద్యాలయాల నిర్మాణానికి గుర్తించిన 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ సత్యప్రసాద్ ఆర్డీవో ఆనంద్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ భూమిని సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాగులపేటలో అక్రమ ఇసుక డంపులను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే జరిమానాతో సరిపెట్టకుండా కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్ కిషన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

కథలాపూర్, జూలై 2: కథలాపూర్ మండలం భూషణరావుపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో భారత్ పెట్రోల్, డీజిల్ బంక్‌ను ఏర్పాటు చేయగా కంపెనీ ప్రతినిధులతో కలిసి మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సహకార సంఘం ద్వారా రూ. 40 లక్షలు వెచ్చించామన్నారు. బంక్‌ను సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భారత్ ఆయిల్ కంపెనీ కరీంనగర్ సేల్స్ మేనేజర్ శరత్‌జిత్, జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, వైస్ చైర్మన్ మిట్టపల్లి లక్ష్మి, డైరెక్టర్లు గుండారపు గంగాధర్, పంచాతి శంకర్, లోక రాజారెడ్డి, నాయకులు, రైతులు వినోద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, గంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో అరుణ్ పాల్గొన్నారు.


పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, తదితరులు

రాజేశ్వర్‌రావుపేట వంజర సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న శంకర్

వంజరుల సంక్షేమానికి కృషి

మెట్‌పల్లి రూరల్, జూలై 2: వంజర కుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మల శంకర్ పేర్కొన్నారు. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట వంజర సంఘ భవన నిర్మాణానికి రాష్ట్ర సంఘం తరపున రూ. లక్ష మంజూరైంది. మంగళవారం సంబంధిత చెక్కును రాజేశ్వర్‌రావుపేట సంఘం సభ్యులకు మంగళవారం శంకర్ అందజేశారు. వంజర సంఘం అభివృద్ధి, పేద విద్యార్థులకు హైదరాబాద్ హాస్టళ్లలో వసతి, వృద్ధులకు పెన్షన్ వంటి సదుపాయాలను సంఘం ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రాజేందర్, మాజీ సర్పంచ్ నల్ల విఠల్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి అరెస్ట్

మెట్‌పల్లి, జూలై 2: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పట్టణంలోని అక్రమ వడ్డీ వ్యాపారులు కట్కం ప్రకాశ్, కట్కం కార్తీక్‌ను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఎలాంటి అనుమతి లేకుండా ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నారనే సమాచారంతో గత ఏప్రిల్‌లో అప్పటి ఎస్సీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కట్కం పాన్ బ్రోకర్స్ పేరిట వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసి కట్కం ప్రకాశ్ ఇంట్లో పోలీసులు సోదాలు జరిపారు. కాగా, ప్రకాశ్‌తో పాటు కార్తీక్, కుటుంబసభ్యులు పోలీసుల తనిఖీలకు సహకరించకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ బంగారం, నగదు సీజ్ చేస్తే తాము పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దీంతో స్థానిక ఎస్ఐ ఫిర్యాదు మేరకు ప్రకాశ్, కార్తీక్, కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మెట్‌పల్లి కోర్టు అనుమతితో నిందితులు ప్రకాశ్, కార్తీక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

జగిత్యాల టౌన్, జూలై 2: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు జగిత్యాల ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. కాగా, స్పందించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు యాద రామకృష్ణ, శ్రీపాద నరేశ్, ముసిపట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 2: మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన రుద్ర సత్తయ్య (46) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్య డిష్ కాంట్రాక్ట్ తీసుకుని ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. డిష్ సరిగ్గా నడవక నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తయ్య భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న కేటీఆర్

ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం జడ్పీ చైర్మన్లకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. కాగా, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ దంపతులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్‌కు రామన్న జ్ఞాపిక బహూకరించారు. -జగిత్యాల టౌన్, జూలై 2

ఇద్దరు దొంగల అరెస్టు

- బంగారు, వెండి నగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూలై 2: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లిలో జరిగిన ఓ దొంగతనం కేసును వారం వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. ఇద్దరి అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి అపహరణకు గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మెట్‌పల్లి సబ్‌డివిజనల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు నిందితుల అరెస్టు చూపి, వివరాలు వెల్లడించారు. మేడిపల్లి గ్రామానికి చెందిన జోగిరి శంకర్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 22న షిర్డీకి వెళ్లారు. 24న రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టారని శంకర్ సోదరుడు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వెంటనే బయలుదేరి వచ్చారు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులోని బట్టలను చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన ఐదు తులాల బంగారు బిస్కెట్, తులం బంగారు గొలుసు, రెండు తులాల బంగారు తీగ, పది తులాల వెండి కడ్డీ, రూ.1.50 లక్షలు దొంగలు అపహరించుకు వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మెట్‌పల్లి డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి దొంగల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 2న మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ శివారులోని గండి హనుమాన్ ఆలయం వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. నిజామాబాద్ జిల్లా మాదాపూర్‌కు చెందిన దర్పల్లి సాయిలు, బాసరకు చెందిన కొసిడియా మోహన్ గత నెలలో మేడిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం, నిజామాబాద్ జిల్లాలో మూడు బైక్‌లను అపహరించినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి 8 తులాల బంగారం, 10 తులాల వెండి కడ్డీలు, రూ. 20 వేల నగదు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. సాయిలుపై ఇప్పటికే వివిధ పోలీస్‌స్టేషన్లలో హత్య కేసుతో పాటు మరో 22కు పైగా చోరీ కేసులు ఉండగా, మోహన్‌పై 16కు పైగా కేసులున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. దొంగలను చాకచక్యంగా పట్టుకొని సొత్తును రికవరి చేసిన సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది కిరణ్, చైతన్య, సంతోష్‌ను అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొడిమ్యాల, జూలై 2: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మేన్నేని స్వర్ణలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి సమావేశం అయినందున సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పెగడపల్లి, జూలై 2: పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగుస్తున్నందున ఎంపీపీ గోళి శోభా-సురేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ కిక్ బాక్సింగ్ దినోత్సవం

జగిత్యాల టౌన్, జూలై 2: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో జాతీయ కిక్ బాక్సింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోర సుమన్ మాట్లాడుతూ, నిరంతర కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎలా చేరుకుంటారో వివరించారు. పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు మాట్లాడుతూ, కిక్ బాక్సింగ్‌తో శారీరకంగా, మానసికంగా కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

జగిత్యాల టౌన్, జూలై 2: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రాగి జావకు రూ. 2 అందించడంతో పాటు కోడి గుడ్లను సరఫరా చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యం, డ్రెస్ కోడ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెన్న మహేశ్, గుగ్గిళ్ల శారద, లక్ష్మి, షంశేర్, జమున పాల్గొన్నారు.

విరమణ పొందిన ఉద్యోగికి సత్కారం

మేడిపల్లి, జూలై 2: మండల కేంద్రంలోని పీఎన్ఆర్ గార్డెన్‌లో మంగళవారం ఇన్‌చార్జి ఎంపీగా ఉద్యోగ విరమణ పొందిన పాంపట్టి శ్రీనివాస్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ దంపతులను ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొనకంటి ఉమాదేవి, రాజరత్నాకర్‌రావు, జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

కోరుట్ల, జూలై 2: పట్టణంలోని పలు ప్లాస్టిక్, కిరాణా షాపుల్లో మున్సిపల్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాస్‌లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న, విక్రయిస్తున్న దుకాణాదారులకు జరిమానా విధించారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ కిరాణా షాపులో గడువు ముగిసిన తినుబండరాలు విక్రయిస్తుండగా రూ. 1500 జరిమానా వేశారు. ఇక్కడ మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, వార్డు అధికారి ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

వీడియో కాన్ఫరెన్‌కు హాజరైన రైతులు

సారంగాపూర్, జూలై 2: మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు విత్తనాల ఎంపిక, అధిక సాంద్రత పత్తి పంట, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగులో ఆధునిక పద్ధతులు, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏవో తిరుపతి నాయక్, ఏఈవో వెంకటేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ వసతి గృహం వద్ద తల్లిదండ్రుల ఆందోళన

జగిత్యాల టౌన్, జూలై 2: పట్టణంలోని మైనార్టీ వసతి గృహం నుంచి 8వ తరగతి విద్యార్థి ఎండీ తఫీం బయటకు పారిపోయినా తమకు ప్రిన్సిపాల్ సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే... మంగళవారం సాయంత్రం తఫీం తల్లిదండ్రులు హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేయగా, పాఠశాలలో లేడని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వెళ్లి సీసీ ఫుటేజ్‌లు పరిశీలించగా, తఫీం మధ్యాహ్నం 2 గంటలకు గేటు నుంచి బయటకు వెళ్లినట్లు పరిశీలించారు. జిల్లా కేంద్రంలో గాలించగా, మంచినీళ్ల బావి వద్ద తఫీం కనిపించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోయినా కనీసం సమాచారం ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫోన్ పే, గూగుల్ పే ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించవద్దు

పెగడపల్లి, జూలై 2: పెగడపల్లి మండల విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లు ఫోన్ పే, గూగుల్, అమెజాన్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లించవద్దని ఏఈలు శ్రీనివాస్, మధు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఇకపై గ్రామాలకు వచ్చే బిల్ కలెక్టర్‌కు చెల్లించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో చెల్లించే వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన

కోరుట్ల, జూలై 2: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా సఫాయి అప్నావో బీమారి భగావోపై విద్యార్థులకు మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి, విప్ చిత్రపటాలకు పాలాభిషేకం

కథలాపూర్, జూలై 2: మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ ఫొటోలున్న ఫ్లెక్సీకి మంగళవారం కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. మండలంలోని కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పదేళ్ల క్రితం నిలిచిపోగా, ఇటీవల పునః ప్రారంభించినందుకు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎండీ అజీమ్, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, బోదాసు నర్సయ్య, మహేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కోరుట్ల రూరల్, జూలై 2: మండలంలోని మాదాపూర్‌లో మంగళవారం గ్రామస్తులకు జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య మొక్కలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ చేపూరి కృష్ణారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ఆదిరెడ్డి, పంచాయతీ ప్రత్యేకాధికారి ధీరజ్, కార్యదర్శి గంగజల ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్, జూలై 2: వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎంపీవో ప్రవీణ్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్, తాండ్యాల గ్రామాల్లో మంగళవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇండ్ల ఆవరణలో కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు కిరణ్, రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సీఐకి సత్కారం

సీఐని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మెట్‌పల్లి, జూలై 2: మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి మైలారపు లింబాద్రి ఆధ్వర్యంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు రాంబాబు, కోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఇబ్రహీంపట్నం, జూలై 2: మండలంలోని గోదూర్ గ్రామానికి చెందిన నల్ల లక్ష్మి (54) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి భర్త సంజీవరెడ్డి రెండేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి మానసిక వేదనకు గురై ఒంటరిగా ఉంటూ ఆలోచిస్తూ ఉండేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గత నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. వాంతులు చేసుకోవడంతో గమనించిన కుమారుడు రాజశేఖర్‌రెడ్డి మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అనిల్ పేర్కొన్నారు.

మా కొడుకును స్వదేశానికి తీస